క్లుప్తంగా

కాలుష్యం లేని జీవన విధానమే శ్రీరామరక్ష

కడప ఎడ్యుకేషన్‌: కాలుష్యం లేని సహజ జీవన విధానం ఒక్కటే అందరి ఆరోగ్యానికి శ్రీరామ రక్ష అని, దీనిని అందరూ అవలంబించాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకులు డాక్టర్‌ సావిత్రి పేర్కొన్నారు. కడప నగర శివార్లలోని కేంద్రీయ విద్యాలయంలో శనివారం సుస్థిర అభివృద్ధి- పర్యావరణ పరిరక్షణ , సహజ జీవన విధానం అనే అంశంపై ప్రిన్సిపాల్‌ మునిష్‌మీనా ఆధ్వర్యంలో ఒక్క రోజు వర్క్‌షాప్‌ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ సావిత్రి, విద్యాశాఖ రాష్ట్ర రీసోర్సు పర్సన్‌ డాక్టర్‌ గునిశెట్టి శ్రీనివాసులు వక్తలుగా పాల్గొన్నారు. అనంతరం పవర్‌ పాయింట్‌ ప్రెజెంటేషన్‌ ద్వారా వివిధ అంశాల గురించి వివరించారు. సమన్వయకర్తలుగా ఉపాధ్యాయులు రాజేంద్రసింగ్‌, వెంకట మహేష్‌కుమార్‌లు వ్యవహరించారు.

డాక్టరేట్‌ ప్రదానం


రవికుమార్‌

వైవీయూ : వైవీయూ భూవిజ్ఞాన శాస్త్రంలో పి. రవికుమార్‌కు డాక్టరేట్‌ ప్రకటించింది. భూవిజ్ఞానశాస్త్ర సహ ఆచార్యులు డాక్టర్‌ ఎస్‌. శ్రీనివాసగౌడ్‌ పర్యవేక్షణలో 'పండమేరు నది పరివాహక ప్రాంత పరిశోధనాత్మక విశ్లేషణ : జియో స్పేషియల్‌ టెక్నాలజీ అనంతపురం జిల్లా ఆంధ్రప్రదేశ్‌' అన్న అంశంపై ఈయన చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్‌ ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

28న జానమద్దిపై స్మారకోపన్యాసం

కడప కల్చరల్‌ : సీపీ బ్రౌన్‌ గ్రంథాలయ వ్యవస్థాపకులు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్‌ జానమద్ది హనుమచ్ఛాస్త్రి దశమ వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 28న సీపీ బ్రౌన్‌ భాషా పరిశోధన కేంద్రంలో స్మారకోపన్యాసం నిర్వహించనున్నామని ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్‌, విశిష్ట అతిథిగా రిజిస్ట్రార్‌ వైపీ వెంకట సుబ్బయ్య హాజరవుతారని, తాను సభకు అధ్యక్షత వహిస్తానన్నారు. ప్రముఖ అవధాని డాక్టర్‌ నరాల రామారెడ్డి ప్రధాన వక్తగా పాల్గొని అవధాన వైభవం అనే అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు.

పోలియో చుక్కలు వేయించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : మార్చి 3న జరిగే పల్స్‌ పోలియో కార్యక్రమంలో 0-5 సంవత్సరాల మధ్య వయస్సు గల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కడపకు చెందిన వైద్య నిపుణులు డాక్టర్‌ ఆసిఫ్‌ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎంఎం ఆస్పత్రిలో రాయల్‌ రషీద్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో రూపొందించిన పల్స్‌ పోలియో పోస్టర్లను డాక్టర్‌ ఆసిఫ్‌ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాయల్‌ కరీముల్లా, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్న బీజేపీ

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌ పేర్కొన్నారు. శనివారం నగరంలోని రవీంద్ర నగర్‌ లోని యు.ఎస్‌. మహల్‌ కళ్యాణ మండపంలో ఐక్య ముస్లిం మైనార్టీ సంఘాలు, దర్గాల పరిరక్షణ కమిటీ పీఠాధిపతి, గురువులు ఖందీర్‌ అధ్యక్షతన ×ఈవీఎంలు వద్దు - బ్యాలెటే ముద్దు అనే అంశంపై సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలోని అంశాలను బీజేపీ విస్మరించిందని మండిపడ్డారు. ఈవీఎంల పారదర్శకతపై దేశవ్యాప్తంగా మేధావుల్లో అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. ఎన్నికల్లో బ్యాలెట్‌ విధానాన్ని అమలు చేయాలన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం వసతిగృహాల్లో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. శనివారం వైవీయూలో వీసీ ఆచార్య చింతా సుధాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా కార్యదర్శి జి. వలరాజు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సునీల్‌, విశ్వవిద్యాలయాల కన్వీనర్‌ ఎం.ఆర్‌. నాయక్‌లు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలోని హెల్త్‌సెంటర్‌లో మహిళా వైద్యురాలిని నియమించాలని కోరారు. విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు చేపట్టాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్‌ నాయకులు పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్‌

కడప కార్పొరేషన్‌: మా నమ్మకం ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అని కడప నగరం మసాపేట సున్నపురాళ్ల మిట్టకు చెందిన ప్రజలు అన్నారు. శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు పి. సంపత్‌, చైతల్య ఆధ్వర్యంలో స్థానిక లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గడపలో జగనన్న సంక్షేమ పథకాలు పొందిన వారు మా నమ్మకం జగనన్నే అని చెబుతున్నారన్నారు. జగనన్న అమ్మఒడి ద్వారా దళిత బిడ్డలు ఇంగ్లిష్‌ మీడియం చదువులు పొందుతున్నారని, పేదల సొంత ఇంటి కల జగనన్న ద్వారా నెరవేరిందన్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుంటామని స్థానికులు ముక్త కంఠం తో తెలిపారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

– ఉప ముఖ్యమంత్రి ఎస్‌.బి.అంజాద్‌ బాషా

కడప కార్పొరేషన్‌ : జగనన్న ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు సంతృప్త స్థాయిలో అందుతున్నాయని ఉపముఖ్యమంత్రి ఎస్‌.బి. అంజాద్‌ బాషా అన్నారు. శనివారం ×గడప గడపకు మన ప్రభుత్వం¥ కార్యక్రమం లో భాగంగా స్థానిక 44వ డివిజన్‌లోని సత్తార్‌ కాలనీ, కాగితాలపెంట ప్రాంతాల్లోని పలు వీధుల్లో పర్యటించి, ఇంటింటికీ వెళ్లి ... ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి వారు పొందుతున్న లబ్ధి సమాచారంతో కూడిన బుక్‌ లెట్‌ను అందజేశారు.

– సిరివెళ్ల సరోజమ్మ అనే మహిళ మాట్లాడుతూ జగనన్న ఇంటి స్థలం, నిర్మాణానికి నగదు, జగనన్న అమ్మ ఒడి, వైఎస్‌ ఆర్‌ పింఛన్‌ కానుక పథకాల ద్వారా రూ. 11,33,736 లబ్ధి పొందామని, ఈ ప్రభుత్వానికి ఎల్లప్పుడూ బాసటగా ఉంటామని ఆనందం వ్యక్తం చేసింది.

– సాయిపేట నాగరత్న అనే మహిళ మాట్లాడుతూ ఇంటి స్థలం, ఇంటిని నిర్మించు కోవడానికి నగదు, జగనన్న అమ్మ ఒడి, వైఎస్‌ ఆర్‌ చేయూత, వైఎస్‌ ఆర్‌ పింఛన్‌ కానుక వంటి పథకాల ద్వారా రూ. 9, 51,750 లబ్ధి చేకూరిందని దీంతో మా కుటుంబం అంతా సంతోషంగా ఉన్నామన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి కలకాలం ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 44వ డివిజన్‌ ఇన్‌చార్జి వి. రామక్రిష్టారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, ఎన్‌. సుబ్బారెడ్డి, పస్తం అంజి, సీహెచ్‌ సునీల్‌, అర్జున్‌, షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

కడప కార్పొరేషన్‌: పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో భరోసా కల్పిస్తోందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌. బి. అంజాద్‌ బాషా అన్నారు. శనివారం స్థానిక తన క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్‌ ఫండ్‌ కింద కడప నగరానికి చెందిన ఏ. సంధ్యారాణి, బి. నరసింహులకు రూ.2 లక్షలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం ఎస్‌ బి అంజాద్‌ బాష మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశాయన్నారు. వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి ప్రభుత్వం వచ్చిన వెంటనే 3వేలకు పైగా వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చారని గుర్తు చేశారు. గతంలో క్యాన్సర్‌ వ్యాధి చికిత్స కు రూ. 2 లక్షలకు పరిమితి ఉండేదని ప్రస్తుతం ఆ పరిమితి లేకుండా ఉచితంగా చికిత్స పూర్తి అయ్యేంతవరకు వైద్యం అందిస్తున్నారని తెలిపారు. అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ తమ వైద్యానికి సాయం చేసి ఆదుకున్న సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సూర్య నారాయణ రావు, షఫీ, అజ్మతుల్లా, తదితరులు పాల్గొన్నారు.


సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

వేడుకగా నవకలశ స్నపనం

కడప కల్చరల్‌ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జున రావు ఆధ్వర్యంలో నిర్వాహకులు దుర్గాప్రసాద్‌ కుటుంబ సభ్యులు, భక్తులతో కలిసి ప్రధాన కలశంతో ఆలయ ప్రదక్షిణలు నిర్వహించారు. మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని వేద పండితుల మంత్రోచ్చాటనలతో కలశాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆ కలశాలలోని పవిత్ర జలాలతో అమ్మవారి మూలమూర్తిని అభిషేకించారు. తర్వాత యాగశాలలో చండీహోమం, ఆలయ మండపంలో నవావరణ శ్రీ చక్రార్చన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి దర్శనానికి భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. రాత్రి అమ్మవారిని పులి వాహనంపై కొలువుదీర్చి ఆలయ ప్రదక్షిణ చేయించారు.

– బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం అభిషేకాలు, అనంతరం చండీహోమం, శ్రీచక్రార్చన, వృషభ వాహనంపై ఊరేగింపు తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు.


విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ

భక్తిశ్రద్ధలతో మాఘ పౌర్ణమి పూజలు

కడప కల్చరల్‌ : కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్‌ ఆధ్వర్యంలో శాశ్వత ధర్మకర్త వంకదారి రామరత్నమ్మ, ఆలయ కమిటీ అధ్యక్షులు వెంకట సుబ్బారెడ్డి, ధర్మకర్తలు నాగేశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలో పలు పూజోత్సవాలు నిర్వహించారు. ఆలయ సేవా మండలి, మహిళా మండలి సభ్యులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని సామూహిక పూజలు నిర్వహించారు.


విశేష అలంకారంలో స్వామి, అమ్మవార్లు

వైవీయూ వసతిగృహాల పరిశీలన

- కుదుటపడిన విద్యార్థుల ఆరోగ్యం
- తాగునీటి ట్యాంకులను పరిశీలించిన వీసీ
- సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక కార్యాచరణ

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయంలో విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి కుదుటపడి సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని వైస్‌ చాన్సలర్‌ ఆచార్య చింతా సుధాకర్‌ స్పష్టం చేశారు. శనివారం రిజిస్ట్రార్‌ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్‌ ఆచార్య ఎస్‌.రఘునాథరెడ్డి, ఇంజినీర్‌ రాజశేఖర్‌ రెడ్డి, వార్డెన్లు, సిబ్బందితో కలిసి అన్ని వసతి గృహాలను, వాటి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. తాగునీటి ట్యాంకులు, పైప్‌ లైన్లు, మురుగు కాలువలు, నీటి నిల్వలు ఉన్న పరిసర ప్రాంతాలు క్షుణ్ణంగా పరిశీలించారు. పారిశుద్ధ్య చర్యలు తీసుకునే విషయంపై అక్కడికక్కడే అధికారులతో మాట్లాడారు. అనంతరం సీవీ రామన్‌ సైన్స్‌ భవన్‌లోని సెమినార్‌ హాల్లో వార్డెన్లు, స్టీవర్డ్‌లు, వంట మనుషులు, సహాయకులు, ఇంజినీరింగ్‌ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం కుదుటపడటం, కొత్త వారెవరు నమోదు కాకపోవడం సంతోషాన్నిచ్చిందన్నారు. ఫుడ్‌ సేఫ్టీ అధికారులు ఆహార, నీటి నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌ కు తీసుకెళ్లి పరీక్షించి ఎలాంటి హానికర పదార్థాలు లేవని మౌఖికంగా తెలిపారన్నారు. అయినప్పటికీ మనమంతా నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. సరికొత్త ప్రణాళికను రూపొందించి అమలు చేయనున్నామన్నారు. సిబ్బందిని ఒక హాస్టల్‌ నుంచి మరో హాస్టల్‌ కు సర్దుబాటు చేస్తున్నామన్నారు. హాస్టళ్లలో పని చేసేవారికి డ్రెస్‌ కోడ్‌, అలానే చేతులకు గ్లౌజులు, తలకు క్యాపు లాంటివి ధరించేలా చూస్తామన్నారు. నైపుణ్యం గల వంటపని వారిని తీసుకుంటామన్నారు . బయట తయారుచేసిన ఆహార పదార్థాలను లోనికి అనుమతించకుండా గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిరోజు హాస్టళ్లను తనిఖీ చేస్తూ , రోజువారి నివేదికలను తెప్పించుకుంటామన్నారు. ఆకస్మిక తనిఖీలు ఉంటాయన్నారు. అలానే విద్యార్థుల రక్షణ చర్యల్లో భాగంగా జిల్లా ఎస్పీని కలిసి పోలీస్‌ అవుట్‌ పోస్ట్‌ ఏర్పాటయ్యేలా చూస్తామన్నారు. కొత్త ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయ సంకల్పించామన్నారు.


భోజనశాలలో వంటను పరిశీలిస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్‌

రైతుల అభివృద్ధికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్‌రెడ్డి

కడప అగ్రికల్చర్‌: రైతులు వ్యవసాయ పరంగా పురోగతిని సాధించేందుకు శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయ అధికారులు తగిన సూచనలు సలహాలను ఇచ్చి అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కడప నగర శివార్లలోని ఊటకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో కిసాన్‌ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల కాలంలో కూలీల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ తరుణంలో యాంత్రీకరణ అనేది రైతులకు ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. ఈ ఏడాది జిల్లాలో వరిపంటలో ఎప్పుడు చూడనటువంటి సమస్యను చూశామన్నారు. నాటిన వరి నారు ఎండిపోయి చనిపోవడం జరిగిందన్నారు. ఈ విషయంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు పొలాలకు వెళ్లి సమస్యను పరిశీలించి పంటలకు అందించే నీటిలో లవణశాతం ఎక్కువై ఇలా మొక్కలు చనిపోతున్నా యని తేల్చారన్నారు. శాస్త్రవేత్తలు ఎన్‌వికేవి ప్రసాద్‌, ఎస్‌. కరీముల్లా, సునిల్‌కుమార్‌, పశుసంవర్థకశాఖ వైద్యులు డాక్టర్‌ రాంబాబు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

పులివెందుల టౌన్‌ : పట్టణంలోని శ్రీవేంకటరమణుడి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేంకటరమణుడు శనివారం సతీమేతుడై బ్రహ్మరథంపై కొలువుతీరి భక్తులకు దర్శనమిచ్చారు. రథోత్సవాన్ని మున్సిపల్‌ చైర్మన్‌ వరప్రసాద్‌ ప్రారంభించారు. భక్తులు రథానికి (తేరు) ఉన్న తాళ్లను పట్టుకుని ముందుకు కదిలించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిర్మాణ రంగంలో సాంకేతిక వినియోగం

ఏఎఫ్‌యూ: నిర్మాణ పరిశ్రమ రంగంలో సాంకేతిక వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో వాటికి అవసరమైన సాఫ్ట్‌వేర్‌ ఆచరణాత్మక అనుభవాన్ని వినియోగించుకోవాలని కేఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్‌ కళాశాల సివిల్‌ విభాగాధిపతి డాక్టర్‌ సుధీర్‌కుమార్‌ రెడ్డి సూచించారు. శనివారం కడప నగరంలోని డాక్టర్‌ వైఎస్‌ఆర్‌ ఆర్కిటెక్చర్‌ అండ్‌ ఫైన్‌ఆర్ట్స్‌ విశ్వవిద్యాలయంలో స్కూల్‌ ఆఫ్‌ ప్లానింగ్‌ అండ్‌ ఆర్కిటెక్చర్‌, డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ ప్లానింగ్‌ ఆధ్వర్యంలో ×ప్రిమేవెరా¥ పేరుతో సాఫ్ట్‌వేర్‌ వర్క్‌షాప్‌ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్‌ సాధనాలు, ఇంటర్‌ఫేస్‌, సాఫ్ట్‌వేర్‌ హ్యాండ్లింగ్‌ ఉపయోగాలు, రియల్‌టైం అసెస్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. విశ్వవిద్యాలయ వైస్‌ చాన్సలర్‌ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్‌, రిజిస్ట్రార్‌ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డిలు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని సాఫ్ట్‌వేర్‌లను నేర్చుకునేందుకు, నిర్మాణరంగంలో నైపుణ్యాన్ని పొందేందుకు ఇలాంటి వర్క్‌షాప్‌లు ఉపయోగపడాలని సూచించారు. కార్యక్రమంలో వర్క్‌షాప్‌ సమన్వయకర్తలు ప్రత్యూష, నారప రెడ్డి, సందీప్‌, రీతుమెర్సీ తదితరులు మాట్లాడారు. ఆర్కిటెక్చర్‌, ప్లానింగ్‌ రంగంలో ఇప్పుడు అందుబాటులో ఉన్న అత్యాధునిక సాఫ్ట్‌వేర్‌ టూల్స్‌ గురించి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్‌ రాజేష్‌కుమార్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.


వర్క్‌షాప్‌కు హాజరైన విద్యార్థులతో అధ్యాపకులు

వ్యక్తి అరెస్ట్‌

కడప అర్బన్‌: కడప నగరంలోని చిన్నచౌక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శనివారం బ్రహ్మయ్య పెట్రోల్‌ బంక్‌ సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వల్లూరు మండలానికి చెందిన బండాలి శేఖర్‌ అనే వ్యక్తిని సీఐ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ రవికుమార్‌ తమ సిబ్బందితో కలిసి అరెస్ట్‌ చేశారు. అతని వద్ద నుంచి 36 క్వార్టర్‌ బాటిళ్ల మద్యంను సీజ్‌ చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా మద్యం తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

26న కడప రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ఈనెల 26వ తేదీ ఉదయం కడప రైల్వేస్టేషన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు కడప రైల్వేస్టేషన్‌ కమర్షియల్‌ ఇన్‌స్పెక్టర్‌ జనార్ధన్‌ తెలిపారు. అమృత్‌ భారత్‌స్టేషన్ల అభివృద్ధిలో భాగంగా దేశ వ్యాప్తంగా 16 రైల్వేస్టేషన్లలో అభివృద్ధి పనులకు దేశ ప్రధాని నరేంద్రమోదీ వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా కడప రైల్వేస్టేషన్‌ ఆవరణలో జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, కడప ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి, కలెక్టర్‌ విజయరామరాజు, ఎస్పీ సిద్దార్థ కౌశల్‌తోపాటు రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు అవుతారన్నారు.

పాత పింఛన్‌ విధానాన్ని పునరుద్ధరించాలి

కడప ఎడ్యుకేషన్‌: పాత పెన్షన్‌ విధానం పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు కోరారు. శనివారం కడప యూటీఎఫ్‌ భవన్‌లో ఓట్‌ ఫర్‌ ఓపీఎస్‌ బుక్‌లెట్‌ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్‌ నరసింహారావు, కార్యదర్శులు ఎజాస్‌అహ్మద్‌, సివిరమణ, ఆడిట్‌ కమిటీ కన్వీనర్‌ ప్రభాకర్‌ నాయకులు గోపీనాథ్‌, వీరనారాయణ, నాగిరెడ్డి, అబ్దుల్‌గని, ఎంసివిఎస్‌ రాజు తదితరులు పాల్గొన్నారు.

కడపలో 'మా' కలెక్షన్స్‌


మా జ్యువెలరీ అండ్‌ డిజైనర్‌ ప్రదర్శనలో వస్తు సామగ్రిని పరిశీలిస్తున్న మహిళలు

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : కడప నగరం ప్రకాశ్‌నగర్‌లో మా జ్యువెలరీ అండ్‌ డిజైనర్స్‌ పేరిట 92.5 సిల్వర్‌ ఆభరణాల ప్రదర్శన, అమ్మకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శన నిర్వాహకులు కృష్ణారెడ్డి, స్వప్న మాట్లాడుతూ తాము ఏర్పాటు చేసిన ప్రదర్శనలో డిజైనర్‌ చీరలు, కలకత్తా, బెనారస్‌, చార్జెట్‌, కాటన్‌ శారీస్‌, కంచిపట్టు కోటా శారీస్‌, టసార్‌, ఆర్‌గంజా వస్త్రాలు, డ్రెస్‌ మెటీరియల్‌, బెడ్‌షీట్లు, దివాన్‌ సెట్లు, ఫ్యాబ్రిక్స్‌ తదితర వాటిని అందుబాటులో ఉంచామన్నారు. నాలుగు రోజులపాటు కొనసాగే ఈ ప్రదర్శనను నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.


ఓటు నమోదుపై అవగాహన



ఎన్‌ఎస్‌ఎస్‌ క్యాంపులో భాగంగా ఓటు నమోదు చేస్తున్న సిబ్బంది

కడప ఎడ్యుకేషన్‌: కడప నగర శివార్లలోని మనుపాలిటెక్నిక్‌ కళాశాల తరపున ఇందిరా నగర్‌ మండల పరిషత్తు ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్‌ క్యాంపులో భాగంగా శనివారం ఓటరు నమోదు , తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మను కళాశాల విద్యార్థులు గ్రామంలోని ఇంటింటి వద్దకు వెళ్లి ఓటరు నమోదు ప్రోగ్రాం గురించి వివరించి ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌ మొహమ్మద్‌ సికిందర్‌ హుస్సేన్‌, మొహమ్మద్‌ ఖాజా మోయినుద్దీన్‌, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళలకు ఆపన్న హస్తం వన్‌ స్టాప్‌ సెంటర్‌


వన్‌స్టాప్‌ సెంటర్‌ సిబ్బందితో మాట్లాడుతున్న న్యాయమూర్తి బాబా ఫకృద్దీన్‌

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ఆపదలో ఉన్న మహిళలకు వన్‌స్టాప్‌ సెంటర్‌ ఆపన్నహస్తంలా నిలుస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్‌ సివిల్‌ జడ్జి బాబా ఫకృద్దీన్‌ తెలిపారు. శనివారం కడప నగర పరిధిలోని రిమ్స్‌ ఆవరణలో ఉన్న వన్‌స్టాప్‌ సెంటర్‌ ను(సఖి) ఆయన తనిఖీ చేశారు. ఆపదలో ఉన్న మహిళలు వన్‌ స్టాప్‌ సెంటర్‌ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వన్‌ స్టాప్‌ సెంటర్లో అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీస్‌ సహాయం ,మానసిక సలహాలు, వీడియో కాన్ఫరెన్స్‌, వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం లాంటి సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే జాతీయ న్యాయ సేవాధికార సంస్థ నేషనల్‌ టోల్‌ ఫ్రీ హెల్ప్‌ లైన్‌ నెంబర్‌ 15100, మహిళలకు 181 ఉమెన్‌ హెల్ప్‌ లైన్‌, 1098 చైల్డ్‌ హెల్ప్‌ లైన్‌, 100 పోలీస్‌ హెల్ప్‌ లైన్‌ మొదలగు టోల్‌ ఫ్రీ నెంబర్లపై అవగాహన కల్పించారు.

సంస్కృతాంధ్ర సాహితీ సిరి 'భూతపురి'

– నేడు భూతపురి సుబ్రమణ్యశర్మ 87వ జయంతి

– వైద్యం వెంకటేశ్వరాచార్యులకు పురస్కార ప్రదానం


భూతపురి (ఫైల్‌)

కడప కల్చరల్‌ : జిల్లాకు వన్నె తెచ్చిన కవులలో డాక్టర్‌ భూతపురి సుబ్రమణ్యశర్మ ప్రముఖంగా నిలుస్తారు. అవధానిగా జ్యోతిష, వాస్తు శాస్త్రాల నిపుణునిగా, సంస్కృతాంధ్రలలో మహాకవిగా పేరుగాంచారు. ఆయన 87వ జయంతి సందర్భంగా ఈనెల 25న సీపీ బ్రౌన్‌ గ్రంథాలయంలో ఆయన పేరిట ఏర్పాటు చేసిన 22వ స్మారక సాహిత్య పురస్కారాన్ని అందజేయనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.

– జిల్లాలోని తప్పెట్ల కొత్తపల్లె గ్రామంలో ఓ పండితుడు పురాణ ప్రవచనం చేస్తున్నారు. ఓరోజు ఆయన అకస్మాత్తుగా అస్వస్థతకు గురికాగా పక్కనే ఉన్న 13 ఏళ్ల ఆయన కుమారుడు తండ్రి స్థానంలో తాను ప్రవచనం మొదలు పెట్టాడు. అంతేకాకుండా మిగతా 13 రోజుల పాటు ఆ బాలుడే ఆ కార్యక్రమం నిర్వహించారు. ఆ బాలుడే భూతపురి సుబ్రమణ్యశర్మ.

– కవి డాక్టర్‌ భూతపురి సుబ్రమణ్యశర్మ 1938 ఫిబ్రవరి 14న వల్లూరు సమీపంలోని తప్పెట్ల కొత్తపల్లెలో జన్మించారు. తండ్రి సుబ్బయ్యశర్మ మహాపండితులు. ఆయన నుంచి కుమారుడు సుబ్రమణ్యశర్మకు సాహిత్య వారసత్వం లభించింది. ప్రొద్దుటూరు మున్సిపల్‌ హైస్కూలులో చదివారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. కంచికామకోటి పీఠాధిపతి శ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామి వద్ద ఆశువుగా పద్యాలు, సంస్కృత శ్లోకాలు చెప్పి ప్రశంసలు పొందారు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జ్యోతిష విభాగానికి పుస్తకాలు రాయడంతోపాటు బోధన కూడా చేశారు. 1989లో డాక్టర్‌ పుట్టపర్తి నారాయణాచార్యుల సమక్షంలో సువర్ణ గండపెండేర సత్కారం జరిగింది. 1997లో కడప నగరంలో ఆయన గజారోహణం చేశారు. స్వర్ణ హస్త కంకణ సత్కారం స్వీకరించారు. ఎన్నో బిరుదులు పొందారు. ఆయన రాసిన శ్రీకృష్ణభారతం తెలుగు సాహితీ లోకంలో విశిష్ట స్థానం కల్పించింది.

– ఆయన పేరిట కుమారుడు డాక్టర్‌ శివరామ సురేంద్రశర్మ, డాక్టర్‌ గోపాలకృష్ణశాస్త్రిలు స్మారక సంస్థను ఏర్పాటు చేసి యేటా ఆయన జయంతి నాడు సాహితీవేత్తకు పురస్కారం ప్రదానం చేస్తున్నారు. ఈ సంవత్సరం ప్రముఖ సాహితీవేత్త వైద్యం వెంకటేశ్వరాచార్యులకు పురస్కారం అందజేయనున్నారు.